**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ: 08.11.2024** **సమయం: 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. మహారాష్ట్రలోని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్రంలోని ఎన్‌డిఎ, రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.
2. భారతదేశం, రష్యా దశాబ్దాలుగా సహజ మిత్రదేశాలు, భాగస్వాములు అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉద్ఘాటించారు.
3. సైనిక సిబ్బంది ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు వెస్ట్రన్ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కమాండ్ కార్యాచరణ సన్నద్ధతను సమీక్షించారు.
4. భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య మొదటి టీ20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు డర్బన్ లో జరుగుతుంది. మ్యాచ్ ఈ రాత్రి ఎనిమిదిన్నరకు ప్రారంభమవుతుంది.

## EVE PM-MAHARASHTRA CAMPAIGN

మహారాష్ట్రలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని బిజెపి సీనియర్ నాయకుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. నాసిక్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో నరేంద్రమోదీ మాట్లాడుతూ... ఉజ్వల యోజన కింద రాష్ట్రంలోని 50 లక్షల మంది మహిళలు ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు పొందారని, హర్ ఘర్ జల్ యోజన కింద 1.25 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్‌లు

అందాయని అన్నారు. రాష్ట్రంలోని 7 కోట్ల మంది నిరుపేదలు ఉచిత రేషన్ పొందుతున్నారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో 7 లక్షలకు పైగా పక్కా ఇళ్లు నిర్మించామని తెలిపారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, **PM** కిసాన్ పథకం, నమో షెత్కారీ పథకం కింద వారికి ఏటా 12,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. మహాయుతి కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే ఈ సాయాన్ని ఏటా 15,000 రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చారు. నాసిక్‌లో రక్షణ తయారీ రంగం వృద్ధి జరుగుతుందన్నారు. ఈరోజు ముందుగా ధూలేలో జరిగిన ర్యాలీలో నరేంద్రమోదీ ప్రసంగించారు. నవంబర్ 20న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## MAHA.-AMIT SHAH

మహారాష్ట్రలో గత రెండేళ్లలో అభివృద్ధికి పాటు పడ్డ మహాయుత ప్రభుత్వాన్ని చూశారని బిజెపి సీనియర్ నాయకుడు , కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. సాంగ్లీ జిల్లాలోని షిరాలలో జరిగిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ, మహాయుతి ప్రభుత్వం ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను అనుసరిస్తోందని అన్నారు. మహాయుతి కూటమి చేసిన ఎన్నికల వాగ్దానాలన్నీ నెరవేర్చినట్లు చెప్పారు.

## PUTIN-INDIA

భారతదేశం, రష్యా దశాబ్దాలుగా సహజ మిత్రదేశాలు, భాగస్వాములు అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉద్ఘాటించారు. నిన్న సోచిలోని వాల్డై డిస్కషన్ క్లబ్‌లో పుతిన్ ప్రసంగించారు. భారతదేశాన్ని గొప్ప దేశంగా పేర్కొంటూ, మాస్కో, కొత్త ఢిల్లీ మధ్య సహకారం అన్ని రంగాలలో విస్తరిస్తోందని పుతిన్ పేర్కొన్నారు. పుతిన్ భారతదేశం ఆర్థిక నాయకత్వాన్ని ప్రశంసించారు.

స్వాతంత్ర్యం సమయంలో సోవియట్ యూనియన్ భారత్ కు మద్దతు ఇచ్చిందని పుతిన్ గుర్తుచేశారు. ఇందువల్లే రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన బలమైన, నమ్మకమైన సంబంధం పెరిగిందని చెప్పారు. భారతదేశం అధిక జనాభా, వేగవంతమైన ఆర్థిక వృద్ధి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తించిన పుతిన్, భారతదేశం ప్రపంచంలోని అగ్రరాజ్యాలలో ఒక స్థానానికి చేరుకుంటుందన్నారు. భద్రత, రక్షణ రంగాలలో భారతదేశం, రష్యా మధ్య పెరుగుతున్న సహకారాన్ని కూడా పుతిన్ ప్రధానంగా ప్రస్తావించారు.

## ARMY CHIEF-WESTERN

సైనిక సిబ్బంది ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు పంచకులలోని వెస్ట్రన్ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కమాండ్ కార్యాచరణ సన్నద్ధతను సమీక్షించారు. వివిధ కీలక కార్యాచరణ, శిక్షణ, లాజిస్టికల్, అడ్మినిస్ట్రేటివ్ అంశాలపై అధికారులు జనరల్ ద్వివేదికి వివరించారు. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల గురించి బాగా తెలుసుకోవాలని సీనియర్ సైనిక నాయకత్వాన్ని ఆయన ప్రోత్సహించారు, ప్రత్యర్థుల నుండి పరిణామం చెందుతున్న బెదిరింపులను ఎదుర్కోవడానికి భారత సైన్యం సంసిద్ధతను నిరంతరం బలోపేతం చేయవలసిన అవసరం ఉందని జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు.

## JHARKHAND-RAHUL

గిరిజనుల నుంచి 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి) లాక్కోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. జార్ఖండ్‌లోని సిమ్‌డేగాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, జార్ఖండ్ ఎన్నికలను ఇండి కూటమి, బిజెపి-ఆర్ఎస్ఎస్ ల మధ్య సిద్ధాంత పోరుగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. అధికారంలోకి వస్తే కుల గణన, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తామని రాహుల్ గాంధీ చెప్పారు.

## BJP-INDI ALLIANCE

ప్రతిపక్షాలు రాజ్యాంగాన్ని విస్మరిస్తున్నారని, దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలను తుంగలో తొక్కుతున్నారని బీజేపీ ఈరోజు తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. కొత్త ఢిల్లీలో మీడియాతో బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ, అభివృద్ధి, సాధికారత గురించి బీజేపీ మాట్లాడుతుందని, ఇండి కూటమి దేశాన్ని విభజించడానికి, వ్యతిరేకతను వ్యాప్తి చేయడానికి, అవినీతికి ఆజ్యం పోయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారని భాటియా ఈ సందర్భంగా ఆరోపించారు.

## KARMAYOGI SAPTAH

కర్మయోగి సప్తః అనే జాతీయ అభ్యాస వారోత్సవ కార్యక్రమం 38 లక్షల గంటలపాటు పరివర్తనాత్మక అభ్యాసం నిర్వహించడం ద్వారా అపూర్వమైన ప్రభావాన్ని సాధించిందని ప్రభుత్వం తెలిపింది. ఈ చర్య వల్ల 45 లక్షలకు పైగా కోర్సు నేర్చుకున్నారని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది అక్టోబరు 19 నుంచి 27వ తేదీ వరకు జరిగిన వారంలో 4.3 లక్షల మంది కనీసం నాలుగు గంటల సమయం కేటాయించి ఈ అభ్యాసంలో పాల్గొన్నారు. దాదాపు 37 వేల మంది గ్రూప్ ఎ అధికారులు, పలువురు సీనియర్ అధికారులు ఈ అభ్యాసంలో పాల్గొన్నారు.

## YADAGIRIGUTTA:

తెలంగాణలోని యాదాద్రీని ఈరోజు నుంచి అన్ని అధికారిక రికార్డుల్లో యాదగిరిగుట్టగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆలయాభివృద్ధికి, ఆలయ నిర్వహణ పర్యవేక్షణకు యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు చేస్తామని కూడా ఆయన ప్రకటించారు.

ఈరోజు యాదగిరిగుట్టలో ఆలయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన భూసేకరణను పూర్తిచేసేందుకు త్వరితగతన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా ఒక ఆలయ board ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు.

**SRILANKA-PROTEST**

శ్రీలంకలో, కొలంబో పోర్ట్ సిటీలో కార్మికులు వేతనాల కోసం దాదాపు తొమ్మిది నెలలుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేతనాలు చెల్లించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. చైనా పోర్ట్ హార్బర్ కంపెనీ కింద పనిచేస్తున్న తమకు సబ్ కాంట్రాక్టర్ తమ జీతాలు చెల్లించడం లేదని నిరసనకారులు తెలిపారు. కొలంబో పోర్ట్ సిటీ డెవలప్‌మెంట్‌లో పాల్గొంటున్న వివిధ కంపెనీలకు చెందిన దాదాపు 400 మంది కార్మికులకు వేతనాలు చెల్లించని కారణంగా వాటి నిర్మాణ పనులు దెబ్బతిన్నాయి.

**<u>IIT SANGAREDDY:</u>**

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడేందుకు సమగ్ర విద్యా విధానం పై 9, 10 తేదీలలో రెండు రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సుకు హైదరాబాద్ ఐఐటి వేదిక కానుంది. సదస్సు ముఖ్య ఉద్దేశం పై హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బి.ఎస్ మూర్తి విలేకరులతో మాట్లాడారు. సదస్సును కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో గతంలో 5 ఐఐటీలు ఉండగా.. నేడు ఆ సంఖ్య 23 కు చేరిందని బి.ఎస్ మూర్తి చెప్పారు.

**BC COMMISSION:**

తెలంగాణలో సమగ్ర కుల సర్వే ప్రశాంతంగా, ఎటువంటి అనుమానాలు లేకుండా జరిగేందుకు అందరూ సహకరించాలని బీసీ కమీషన్ పిలుపునిచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ విభేదాలకు అతీతంగా సహకరించాలని, కమీషన్ తెలియచేసింది. ఎన్యుమరేటర్స్ ఏ రోజు, ఏ ప్రాంత కుటుంబాలను కలుసుకుంటారో ముందస్తుగా ఆ కుటుంబాలకు సమాచారం అందించాలన్నారు.